# కార్యక్షేత్ర మహిళా లైంగిక వేధింపు (నివారణ, నిషేధం, దిద్దుబాటు) చట్టం - 2013

(2013 నాటి 14వ చట్టం)

మహిళలకు కార్యక్షేత్రంలో ఎదురయ్యే లైంగిక వేధింపు నుంచి సంరక్షణ గురించి, లైంగిక హింస నివారణ, నిషేధం, దిద్దుబాటు ఫిర్యాదులు సంబంధిత అంశాలకు సంబంధించిన అంశాలను ఈ చట్టంలో ప్రస్తావించడం జరుగుతోంది.

లైంగిక వేధింపు వల్ల రాజ్యాంగం ద్వారా 14వ అధికరణం నిర్దేశించే స్త్రీ సమానత్వం, 15వ అధికరణం ద్వారా స్త్రీలు సమ్మానంతో జీవించే హక్కు 21వ అధికరణం ప్రకారం లైంగిక వేధింపు లేని స్వేచ్ఛా సురక్షిత వాతావరణంలో ఏ వృత్తినైనా, లేదా ఏ వ్యాపార లేదా వాణిజ్యాలనైనా కొనసాగిస్తూ జీవించే మౌలిక హక్కులకు భంగం కలుగుతోంది.

మహిళలకు లైంగిక వేధింపు నుంచి సంరక్షణ, గౌరవంతో పనిచేసే హక్కులు కల్పించడం విశ్వజనీన మానవహక్కులుగా, అంతర్జాతీయ సదస్సుల్లో గుర్తించారు. స్త్రీల పట్ల అన్ని రకాల వివక్షలను నిర్మూలించాలనే సదస్సు సాధనాంశాలను భారత ప్రభుత్వం 1993 జూన్ 25న అనుమోదించింది.

తత్ప్రభావిత సదుపాయాలను త్వరితగతిన నెరవేర్చే ఉద్దేశ్యంతో మహిళలకు కార్యక్షేత్రంలో ఎదురయ్యే లైంగిక వేధింపుల నుంచి భారత గణతంత్ర 63వ సంవత్సరాన పార్లమెంట్ ద్వారా చట్టంగా రూపొందించడం జరిగింది.

### ప్రవచన లక్ష్యాలు, హేతువులు*

1. కార్యక్షేత్రంలో మహిళలకు వేధింపులు గనక ఎదురవుతే స్త్రీల సమానత్వ, జీవన, స్వేచ్ఛ హక్కులకు భంగం కలుగుతుంది. పరిసరాలలో భద్రతా రాహిత్యం, వైమనస్యం ఏర్పడి మహిళలు పనిలో పాల్గొనేందుకు ప్రోత్సాహం లేకుండా చేస్తుంది. ఆర్థిక, సామాజిక సాధికారత మీద ప్రతికూల ప్రభావం కనబరిచి, మిళితాభివృద్ధి లక్ష్యాన్ని దెబ్బ తీస్తుంది.

---

* 2010 నాటి 144సికి అనుబంధం

2. రాజ్యాంగంలోని 14వ అధికరణం సమానత్వ భావనను ఉద్దీపన చేస్తుంది. అధికరణం 15 ద్వారా మత, జాతి, కుల, లింగ లేదా జనన స్థాన ఆధారితం ఎటువంటి వివక్షను ఎవరిమీదనూ కొనసాగించరాదనే నిషేధం విధిస్తోంది. అధికరణం 19(1) (జి) ద్వారా పౌరులందరూ వారికిష్టమైన వృత్తి లేదా ఉద్యోగం, వ్యాపారం లేదా వాణిజ్యాలు కొనసాగించే హక్కు కల్పిస్తోంది. అంటే ఈ హక్కువల్ల స్త్రీలకూ ప్రతి కోణంలో సమాన, సురక్షిత, భద్రత ఉండే పరిసరాలు లభిస్తాయన్నమాట. అధికరణం 21 ద్వారా జీవన, వ్యక్తిగత స్వేచ్ఛ హక్కులు లభిస్తున్నాయి. వీటిలో సమ్మానంతో జీవించే హక్కులు ఇమిడి ఉన్నాయి. అదే స్త్రీల విషయానికి వస్తే కార్య క్షేత్రంలో వారికి మర్యాద, మన్నన సమ్మానాలు, కొరవడకుండా చూడాలి.

3. అధికరణం 11ఎ నిర్దేశించినట్టుగా అన్ని రూపాలలో ఉన్న వివక్షతల నిర్మూలన (సిఇడిఎ డబ్ల్యూ)కు భారతదేశం కక్షిదారుగా ఉండి రాష్ట్ర కక్షిదార్లను వివక్షతలను ప్రత్యేకించి కార్యక్షేత్రంలో మహిళలకు ఎదురయ్యే వాటిని (నిర్మూలించేందుకు సముచిత విధానాలు) పాటించాలని కోరుతుంది. కార్యక్షేత్రంలో లైంగిక వేధింపువల్ల లింగ నిర్ధారక హింస మహిళల పట్ల జరిగి ఉద్యోగరంగంలో సమానావకాశాలు దెబ్బతింటాయని ఐక్యరాజ్యసమితి సర్వరూప వివక్షతల నిర్మూలన (సిఇడి ఎ డబ్ల్యూ) సంఘంలోని సాధారణ తీర్మానం నెం.19లో పేర్కొంది. మహిళలకు లభించే రాజ్యాంగ హక్కులను సంరక్షించి, ప్రోత్సహించేందుకు భారతదేశం నిబద్ధమై ఉంది. అంతేగాకుండా వివిధ అంతర్జాతీయ ఒప్పందాలను అప్రతిహతంగా అమలు చేసేందుకు విధిగా కృషి చేస్తుంది.

4. వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత రంగాలలో ఉన్న శ్రామికశక్తిలో మహిళలు అధికంగా చేరుతుండటంవల్ల, పనిచేసే సానుకూల వాతావరణం కల్పించాల్సిన విధి ప్రభుత్వంపై పడింది. ప్రతిపాదిత చట్టంలోని సదుపాయాలు మహిళలు ఉద్యోగులయినా కాకపోయినా లైంగిక వేధింపు చర్యల నుంచి సంరక్షిస్తాయి.

5. *విశాఖ వెర్సస్ స్టేట్ ఆఫ్ రాజస్థాన్*, (1997) 7 ఎస్‌సిసి 323 కేసులో సర్వోన్నత న్యాయస్థానం కార్య క్షేత్రాలలో మహిళల పట్ల లైంగిక వేధింపు రాజ్యాంగ సమానత్వ హక్కు ఉల్లంఘనగా గుర్తించి తగిన చట్టం లేనందువల్ల తగిన మార్గ దర్శకాలను సూచించింది.

6. కాబట్టి ప్రతిపాదిత సమగ్ర చట్టం సురక్షితమైన, భద్రత ఉన్న, శక్యవాతావరణాన్ని వయస్సు లేదా ఉద్యోగ హెూదాతో నిమిత్తం లేకుండా (ఇంటి దగ్గర పనిచేసే పనివారు కాకుండా) ప్రతి మహిళకూ కల్పించి అన్ని రూపాలలో ఉండే లైంగిక వేధింపుల నుంచి స్వేచ్ఛనిస్తోంది. ఇందుకు ఉద్యోగ యాజమాన్యాన్ని, జిల్లా మేజిస్ట్రేట్ లేదా అదనపు జిల్లా మేజిస్ట్రేట్ లేదా ప్రతి జిల్లాలో జిల్లా అధికారిగా కలెక్టర్ లేదా డిప్యూటీ కలెక్టర్‌ను బాధ్యులుగా చేస్తూ రాజ్యాంగ బద్ధ దిద్దుబాటు యంత్రాంగాన్ని రూపొందిస్తోంది.

7. క్లాజెస్‌కు ఇచ్చిన వివరణలు సవివరంగా బిల్లులోని సదుపాయాలను వివరిస్తాయి.

8. బిల్లు ద్వారా పై లక్ష్యాలను సాధించడమైంది.

---

## అధ్యాయం-I

## ప్రాథమికం

**1. లఘునామం, పరిధి, ఆరంభం:-** (i) ఈ చట్టాన్ని [1]కార్యక్షేత్ర మహిళా లైంగిక వేధింపు చట్టం (నివారణ, నిషేధం, దిద్దుబాటు) 2013గా వ్యవహరిస్తారు.

(ii) చట్టం భారతదేశం యావత్తుకీ వర్తిస్తుంది.

(iii) కేంద్ర ప్రభుత్వం రాజపత్రంలో ప్రకటించిన నియమిత తేదీ నుంచి వర్తిస్తుంది.

**2. నిర్వచనాలు:-** సందర్భాన్ని బట్టి వేరుగా నిర్వచిస్తే తప్ప ఈ చట్టంలో దిగువ నిర్వచనాలు వర్తిస్తాయి:

ఎ) **'బాధితురాలైన మహిళ'** అంటే-

(i) వయస్సుతో నిమిత్తం లేకుండా మహిళల కార్యక్షేత్రాలకు సంబంధించి ఉపాధిలో ఉన్నా, లేకపోయినా ప్రతివాది ద్వారా లైంగిక వేధింపునకు గురయినది అనే ఆరోపణదారు.

(ii) నివాస స్థానాలు లేదా గృహాలకు సంబంధించి వయస్సుతో నిమిత్తం లేకుండా ఆ స్థానాలు లేదా గృహాలలో ఉపాధిలో ఉన్న మహిళలు.

1. తేదీ : 9-12-2013 నుంచి అమలు.

బి) **'సముచిత ప్రభుత్వం'** అంటే-

(i) ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మొత్తానికి నిధులు పాక్షికంగా సమకూర్చినా లేదా పూర్తిగా సమకూర్చినా లేదా నియంత్రించినా లేదా యాజమాన్యంతో ఉన్న కార్యక్షేత్రం-

ఎ) కేంద్ర ప్రభుత్వం ద్వారా లేదా కేంద్ర పాలిత పరిపాలనతో కేంద్ర ప్రభుత్వ నియంత్రితం,

బి) రాష్ట్ర ప్రభుత్వం ద్వారా, రాష్ట్ర ప్రభుత్వ నియంత్రితం.

(ii) కార్యక్షేత్రానికి సంబంధించి ఉపక్లాజ్ (i) లో పేర్కొనబడనివి. ఈ క్షేత్ర పరిధిలోకి వచ్చే రాష్ట్ర ప్రభుత్వ నియంత్రితాలు.

సి) **'అధ్యక్షుడు'** అంటే సెక్షన్ 7 లోని ఉపసెక్షన్ (1) ప్రకారం స్థానిక ఫిర్యాదుల సంఘం అధ్యక్షుడు.

డి) **'జిల్లా అధికారి'** అంటే సెక్షన్ 5 ప్రకారం ప్రకటితమైన అధికారి.

ఇ) **'గృహకార్మికులు'** అంటే ఇంటిపట్టున ఉన్న పనులు చేసేందుకు వేతనంతో ఉపాధి పొందిన మహిళ. వేతనం అనేది నగదుగా లేదా ఇతర రూపంలో ప్రత్యక్షంగా లేదా ఏజెన్సీ ద్వారా తాత్కాలిక లేదా శాశ్వత ప్రాతిపదికన పూర్తికాలం లేదా పాక్షిక సమయానికి నియమితురాలైన వ్యక్తి. అయితే యాజమాన్య కుటుంబ సభ్యురాలై ఉండకూడదు.

ఎఫ్) **'ఉద్యోగి'** అంటే కార్యక్షేత్రంలో నియామకం చెందిన వ్యక్తి. సదరు వ్యక్తి క్రమబద్ధమై, శాశ్వత, తాత్కాలిక అడ్‌హాక్ లేదా దినసరి వేతన ప్రాతిపదికన ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా లేదా ఏజెంట్ ద్వారా నియమితుడై ఉండవచ్చు. ఏజెంట్ అన్నప్పుడు కాంట్రాక్టర్ ద్వారా, ప్రధాన యజమానికి తెలిసీ లేదా తెలియని విధంగా నియమితుడై వేతనంతో కానీ, వేతనం లేక కానీ స్వచ్ఛంద ప్రాతిపదికన లేదా ఇతరత్రా ఉద్యోగ నియమాలలో సహశ్రామికుడిగా, ఒప్పంద శ్రామికుడిగా పరివీక్షాధీనకుడిగా, శిక్షణార్థి, ఉమేజ్‌వార్ లేదా ఇతరంగా ఏ పేరుతోనైనా పిలిచే వ్యక్తి కావచ్చు.

జి) **'యజమాని/నియామకుడు'** అంటే-

(i) విభాగం, సంస్థ, అధీన సంస్థ, వ్యవస్థాపక సంస్థ, ఎంటర్‌ప్రయిజ్, కార్యాలయం, శాఖ లేదా సముచిత ప్రభుత్వ లేదా స్థానిక అధికార యూనిట్ సంబంధితమైనవారు, విభాగ, సంస్థ, అధీనసంస్థ, వ్యవస్థాపక సంస్థ, ఎంటర్‌ప్రయిజ్, కార్యాలయం శాఖ, యూనిట్ అధికారి లేదా సముచిత ప్రభుత్వ లేదా స్థానిక అధికారి, సందర్భాన్ని బట్టి వారి తరపున నియమితులయినవారు.

(ii) ఉపక్లాజ్ (i) ప్రకారం కార్య క్షేత్రం పరిధిలోకి రాని వారు, పర్యవేక్షణ, యాజమాన్యం, కార్యక్షేత్ర నియంత్రణకు బాధ్యత వహించేవారు.

వివరణ: ఈ ఉపక్లాజ్ ప్రయోజనార్థం 'యాజమాన్యం' అంటే సంస్థ పరిపాలన విధానాలు రూపొందించేందుకు బాధ్యులయిన వ్యక్తి లేదా మండలి లేదా సంఘం.

(iii) ఉపక్లాజ్ (i), (ii) లకు సంబంధించి కార్యక్షేత్రాలలో ఉద్యోగులకు సంబంధించిన విధులు నిర్వహించే ఒప్పంద బాధ్యతలున్న వ్యక్తి.

(iv) నివాసస్థానం లేదా ఇల్లుకు సంబంధించి వ్యక్తి లేదా గృహస్తు ఇంటి పనివారి నియామకం నుంచి ప్రయోజనం పొందుతున్నట్లయితే, సంఖ్య, కాలపరిమితితో నిమిత్తం లేకుండా, శ్రామికుల నియామక రకం లేదా ఉద్యోగ స్వభావం లేదా ఇంటిపనివారు ఆచరించే కార్యకలాపాలు.

హెచ్) **'అంతర్గత సంఘం'** అంటే సెక్షన్ 4 ప్రకారం రూపొందించిన 'అంతర్గత ఫిర్యాదుల సంఘం' అని అర్థం.

ఐ) **'స్థానిక సంఘం'** అంటే సెక్షన్ 6 ప్రకారం రూపొందించిన 'స్థానిక ఫిర్యాదుల సంఘం' అని అర్థం.

జె) **'సభ్యుడు'** అంటే సందర్భాన్ని బట్టి 'అంతర్గత సంఘం లేదా స్థానిక సంఘం సభ్యుడు' అని అర్థం.

కె) **'నిర్ధారిత'** అంటే ఈ చట్టంలోని నియమాల ప్రకారం 'నిర్ధారితమైన అంశాల'ని అర్థం.

ఎల్) **'ప్రిసైడింగ్ అధికారి'** అంటే సెక్షన్ 4 లోని ఉపసెక్షన్ (2) ప్రకారం 'అంతర్గత ఫిర్యాదుల సంఘానికి చెందిన ప్రిసైడింగ్ అధికారి'.

ఎమ్) **'ప్రతివాది'** అంటే సెక్షన్ 9 ప్రకారం 'బాధితురాలైన మహిళ ఫిర్యాదు చేసిన వ్యక్తి' అని అర్థం.

ఎన్)**'లైంగిక వేధింపు'** అంటే దిగువ సూచించిన స్వాగతించబడని (ప్రత్యక్ష లేదా ప్రభావగత) చర్యలు లేదా ప్రవర్తనలు:

(i) శారీరక సంబంధం, పురోగమనాలు, లేదా

(ii) లైంగిక సానుకూలతలకు డిమాండ్లు లేదా అభ్యర్థనలు, లేదా

(iii) లైంగిక పరమైన వ్యాఖ్యలు చేయడం, లేదా

(iv) అశ్లీల చిత్రాల ప్రదర్శన, లేదా

(v) స్వాగతించని విధంగా శారీరక, మౌఖిక, మౌఖికేతరంగా శృంగార స్వభావ పూరిత ప్రవర్తన.

ఒ) కార్యక్షేత్రంలో ఈ దిగువ సూచించినవి కూడి ఉంటాయి:

(i) విభాగం, సంస్థ, అధీన సంస్థ, వ్యవస్థాపక సంస్థ, ఎంటర్‌ప్రయిజ్, సంఘం, కార్యాలయం, సముచిత ప్రభుత్వ లేదా స్థానిక అధికారం చేత ప్రత్యక్ష లేదా పరోక్ష యాజమాన్య, నియంత్రిత లేదా పూర్తిగా లేదా పాక్షికంగా నిధులు సమకూర్చిన సంస్థ లేదా ప్రభుత్వ కంపెనీ లేదా కార్పొరేషన్ లేదా సహకార సంఘం.

(ii) ప్రయివేట్ సెక్టార్ సంస్థ లేదా ప్రయివేటు సంస్థ, అధీన సంస్థ, ఎంటర్ ప్రయిజ్, సంఘం, వ్యవస్థాపక సంస్థ, సమాఖ్య, ట్రస్ట్, ప్రభుత్వేతర సంస్థ యూనిట్, వాణిజ్య, వృత్తిపర, సాంకేతిక వృత్తి, విద్యా, వినోద, పారిశ్రామిక, ఆరోగ్య సేవలు అందించే సేవానియోగసంస్థ లేదా ఉత్పాదక సరఫరా, విక్రయ, పంపిణీ లేదా సేవలందించే సేవావినియోగ సంస్థ.

(iii) ఆసుపత్రులు లేదా నర్సింగ్ హోమ్‌లు.

(iv) క్రీడా సంస్థలు, స్టేడియం, క్రీడామండలి లేదా పోటీ క్షేత్రాలు లేదా క్రీడా ప్రాంగణాలు, అవి నివాసస్థానాలు కావచ్చు లేదా క్రీడల లేదా ఇతర కార్యకలాపాలకు వినియోగించని ప్రాంగణాలు కావచ్చు.

(v) ఉద్యోగి సందర్శించే ఏ ప్రాంతమయినా, ఉద్యోగ సమయంలో ఉపయోగంలో ఉన్నది, రవాణాతో సహా, ప్రయాణ సమయం ఇందులోకి వస్తుంది.

(vi) నివాసస్థానం లేదా నివాసం.

పి) **'అవ్యవస్థీకృతరంగం'** అంటే కార్యక్షేత్రాలకు సంబంధించి వ్యక్తులచేత యాజమాన్యమైన సంస్థ లేదా స్వయం ఉద్యోగకృతశ్రామిక సంస్థ. ఈ సంస్థలో ఉత్పాదన లేదా వస్తు సామగ్రి విక్రయం లేదా ఏదో విధమైన సేవా వినియోగం జరుగుతూ ఉంటుంది. సదరు సంస్థల్లో పది మందికి లోబడి శ్రామికులుంటారు.

**3. లైంగిక వేధింపు నిరోధం:-** (1) ఏ కార్యక్షేత్రంలోనూ మహిళలెవరికీ లైంగిక వేధింపు ఎదురుకాకూడదు.

(2) ఈ దిగువ సందర్భాల్లో, ఇతర సందర్భాలలో ఒకవేళ సంభవిస్తే లేదా సంబంధిత లేదా సంబంధిత చర్య లేదా లైంగిక వేధింపు ప్రవర్తనలు లైంగిక వేధింపునకు దారితీయవచ్చు:

(i) మహిళ ఉద్యోగంలో అంతర్గత లేదా బహిర్గతంగా ప్రాతినిధ్య ప్రవర్తనకు వాగ్దానం చేయడం, లేదా

(ii) మహిళ ఉద్యోగంలో అంతర్గత లేదా బహిర్గతంగా హానికరంగా ప్రవర్తించడం, లేదా

(iii) మహిళల ప్రస్తుత లేదా భవిష్యత్ ఉద్యోగ హోదాకు బహిర్గతంగా లేదా అంతర్గతంగా విఘాతం కలిగించడం, లేదా

(iv) మహిళల పనితీరులో జోక్యం చేసుకోవడం లేదా బెదిరింపు ధోరణి లేదా హానికరంగా ప్రవర్తించడం లేదా వైమనస్యపూరిత వాతావరణం కల్పించడం, లేదా

(v) మహిళ ఆరోగ్యానికీ, భద్రతకూ విఘాతం కలిగించే విధంగా చిన్నబుచ్చే తీరుగా వ్యవహరించడం.

## అధ్యాయం-II

## అంతర్గత ఫిర్యాదుల సంఘం ఏర్పాటు

**4. అంతర్గత ఫిర్యాదుల సంఘం ఏర్పాటు:-** (1) కార్యక్షేత్రంలో ప్రతి యాజమాన్యం లిఖిత ఉత్తర్వుతో అంతర్గత ఫిర్యాదుల సంఘం ఏర్పాటు చేయాలి.

కార్యక్షేత్ర పరిపాలన యూనిట్లు లేదా కార్యాలయాలు వేర్వేరు స్థలాల్లో ఉన్నా లేదా విభాగ లేదా ఉపవిభాగాల స్థాయిలో కార్యాలయాలుంటే 'అంతర్గత సంఘా'న్ని పరిపాలక యూనిట్లలో లేదా కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలి.

(2) అంతర్గత సంఘాన్ని దిగువ సభ్యులతో యాజమాన్యం ప్రతిపాదిస్తుంది:

(ఎ) కార్యక్షేత్రంలోని ఉద్యోగులలో సీనియర్ స్థాయిలో ఉన్న మహిళా ఉద్యోగిని 'ప్రిసైడింగ్ అధికారి'గా నియమించాలి.

ఒక వేళ సీనియర్ స్థాయిలో ఉద్యోగి లేకపోతే ఉపసెక్షన్(1)లో సూచించిన కార్యస్థానంలోని పరిపాలక యూనిట్ లేదా కార్యాలయంలోనుంచి ప్రతిపాదించి నియమించవచ్చు.

ఒకవేళ ఇతర కార్యస్థానంలో పరిపాలక యూనిట్ లేదా కార్యాలయంలో సీనియర్ స్థాయిలో మహిళా ఉద్యోగి లభ్యంకాకపోతే అదే యాజమాన్యంలోని ఇతర స్థానంలోనుంచి లేదా ఇతర విభాగం లేదా సంస్థనుంచి ప్రతిపాదించి 'ప్రిసైడింగ్ అధికారి'గా నియమించవచ్చు.

(బి) మహిళా ప్రయోజనాలకు పాటుపడే వారిని లేదా సామాజిక శ్రమలో అనుభవం ఉన్నవారిని లేదా చట్టపరమైన విజ్ఞానం ఉన్నవారిని కనీసం ఇద్దరిని ఉద్యోగులలోనుంచి ఎన్నుకొని సభ్యులుగా నియమించాలి.

(సి) ప్రభుత్వేతర సంస్థలనుంచి లేదా సంఘాలనుంచి, మహిళల గురించి పాటు పడేవారిని లేదా లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా పోరాడేవారిని ఒకరిని సభ్యులుగా నియమించాలి.

అయితే మొత్తం సభ్యుల సంఖ్యలో కనీసం సగం మంది మహిళలై ఉండాలి.

(3) యాజమాన్యం నిర్ధారించి ప్రకటించిన తేదీ నుంచి మూడేళ్ళ కాలవ్యవధికి మించని పరిమితితో అంతర్గత సంఘం ప్రిసైడింగ్ అధికారి, మరియు సభ్యుల నియామకం జరుగుతుంది.

(4) అంతర్గత సంఘం సమావేశం నిర్వహణకు ప్రభుత్వేతర సంస్థల సభ్యులకు లేదా సంఘం సభ్యులకు శుల్కాలను లేదా చెల్లింపులను యాజమాన్యం తాను నిర్ధారించిన రీతిలో చెల్లిస్తుంది.

(5) ప్రిసైడింగ్ అధికారి లేదా అంతర్గత సంఘ సభ్యులెవరూ ఈ దిగువ అంశాలకు పరిమితం కాకూడదు:

ఎ) సెక్షన్ (16) లోని సదుపాయాలకు వ్యతిరేకంగా ప్రవర్తించకూడదు, లేదా

బి) అమలులో ఉన్న చట్ట ప్రకారం నేరాలకు శిక్ష అనుభవించకూడదు లేదా నేర విచారణలో ఉండి ఉండకూడదు, లేదా

సి) క్రమశిక్షణ విచారణలో దోషిగా నిరూపితం కాకూడదు లేదా క్రమశిక్షణా చర్య విచారణ వాయిదా ఉండి ఉండకూడదు, లేదా

డి) కార్యాలయంలో ఉన్న కాలంలో తన స్థాయిని ప్రజాహితం కాని విధంగా దురుపయోగం చేసి ఉండకూడదు.

ప్రిసైడింగ్ అధికారి లేదా సభ్యుడు ఎవరయినా పై చర్యలకు పాల్పడితే, వారిని తక్షణం తొలగించాలి. సదరు ఖాళీని లేదా ఏర్పడిన ఖాళీలను తాజా ప్రతిపాదనలతో ఈ సెక్షన్‌లోని నియమాల మేరకు భర్తీ చేయాలి.

## అధ్యాయం-III

## స్థానిక ఫిర్యాదుల సంఘం ఏర్పాటు

**5. జిల్లా అధికారి ప్రకటన:-** సముచిత ప్రభుత్వం జిల్లామేజిస్ట్రేట్ లేదా అదనపు జిల్లా మేజిస్ట్రేట్ లేదా కలెక్టర్ లేదా డిప్యూటీ కలెక్టర్‌ను ప్రతి జిల్లాకు జిల్లా అధికారిగా ప్రకటించి నియమిస్తుంది. సదరు అధికారి ఈ చట్టంలోని అధికారాలు వినియోగించుకొని విధులు నిర్వర్తిస్తారు.

**6. [1][స్థానిక సంఘం] ఏర్పాటు, పరిధి:-** (1) ప్రతి జిల్లా అధికారి సదరు తన జిల్లాలో [1]['స్థానిక సంఘం'] పేరిట ఒక సంఘాన్ని ఏర్పాటు చేయాలి. దాని ద్వారా [2][అంతర్గత సంఘం] ద్వారా కాని, పదిమంది శ్రామికుల కన్నా తక్కువ ఉన్న సందర్భంలో అయితే యాజమాన్యం నుంచే లైంగిక వేధింపు ఫిర్యాదులను స్వీకరిస్తుంది.

(2) జిల్లా అధికారి ప్రతి బ్లాకుకు, తాలూకాకు, గ్రామీణ లేదా గిరిజన ప్రాంతంలో తహశీల్‌కు, నగర ప్రాంతంలో వార్డుకు లేదా మున్సిపాలిటీకి ఒక నోడల్ అధికారిని నియమిస్తారు. ఆ నోడల్ అధికారి ఫిర్యాదులు స్వీకరించి వాటిని సంబంధిత స్థానిక ఫిర్యాదు సంఘానికి ఏడు రోజులలోగా పంపే ఏర్పాటు చేస్తారు.

(3) ఏర్పాటయిన జిల్లాలో అంతటా [1][స్థానిక సంఘం] పరిధి విస్తరించి ఉంటుంది.

**7. [1][స్థానిక సంఘం] సంయోజన, కాలపరిమితి, ఇతర నియమ నిబంధనలు:-** (1) జిల్లా అధికారి, [1][స్థానిక సంఘం]లో సభ్యులను ఈ దిగువ తెలిపిన విధంగా ప్రతిపాదించి నియమిస్తారు:

ఎ) మహిళల కోసం నిబద్ధులై, సంఘ కృషి రంగంలో ప్రసిద్ధిపొందిన మహిళలను అధ్యక్షులుగా ప్రతిపాదిస్తారు.

బి) జిల్లాలోని మున్సిపాలిటీ లేదా వార్డు లేదా తహశీల్ లేదా తాలూకా లేదా బ్లాక్‌లో ఉద్యోగం చేసే మహిళలనుంచి ఒక మహిళను సభ్యురాలిగా నియమిస్తారు.

సి) ప్రభుత్వేతర సంస్థలు లేదా సంఘాల నుంచి మహిళల కోసం పాటు పడే వారిని లేదా లైంగిక వేధింపుల అంశాలు లేదా సంబంధిత అంశాల గురించి పాటుపడేవారిలో ఇద్దరిని అనగా వారిలో ఒకరు మహిళ అయి ఉండేలాగ నిర్ధారిత రీతిలో సభ్యులుగా నియమిస్తారు.

అయితే నియమితులైన సభ్యులలో ఒకరికి చట్టం లేదా చట్టపరమైన విజ్ఞానం ఉండేలాగ శ్రద్ధ వహిస్తుంది. అయితే సభ్యులైన మహిళలు కేంద్రం ప్రకటించిన షెడ్యూల్డ్ కులాలు లేదా తెగలు లేదా ఇతర

1. Subs. for "స్థానిక ఫిర్యాదు సంఘం" by Act No. 23 of 2016, w.e.f. 9-5-2016.
2. Subs. for "అంతర్గత ఫిర్యాదు సంఘం" by *Ibid.*

వెనకబడిన తరగతులు లేదా మైనారిటీలకు చెందినవారుగా ఉండేలాగ చూస్తుంది.

డి) జిల్లాలో సంబంధిత సంఘ సంక్షేమ లేదా మహిళ, శిశు అభివృద్ధి అధికారి పదవిరీత్యా సభ్యులుగా ఉంటారు.

(2) జిల్లా అధికారి ప్రకటించి, నియమించిన తేదీ నుంచి స్థానిక సంఘం అధ్యక్షుల, సభ్యుల పదవీకాలం మూడేళ్ళకు మించకుండా విస్తరించి ఉంటుంది.

(3) స్థానికసంఘం అధ్యక్షులు, సభ్యులు దిగువ చర్యలకు పూనుకొని ఉండకూడదు.

ఎ) సెక్షన్ 16లోని నదుపాయాలకు వ్యతిరేకంగా ప్రవర్తించకూడదు.

బి) నేరానికి శిక్ష అనుభవించడంగానీ లేదా చట్ట ప్రకారం నేర విచారణ వాయిదాలోగానీ ఉండి ఉండకూడదు.

సి) క్రమశిక్షణ విచారణలో దోషిగాకానీ లేదా క్రమశిక్షణ విచారణ వాయిదాలోగానీ ఉండి ఉండకూడదు.

డి) ప్రజాహితం కాని విధంగా పదవిలో కొనసాగేటప్పుడు పదవి దుర్వినియోగం చేయకూడదు.

అధ్యక్షులు, సభ్యులెవరయినా సందర్భాన్ని బట్టి పై వాటికి పాల్పడితే వారిని సంఘం నుంచి తొలగిస్తారు. వారి స్థానంలో ఇతర యథాలాప ఖాళీలను కూడా తాజా ప్రతిపాదనల ద్వారా ఈ సెక్షన్ సదుపాయాల అనువర్తనతో భర్తీ చేస్తారు.

(4) ఉపసెక్షన్ (1) (బి), (డి) ల ద్వారా ప్రతిపాదించి నియమితులయిన స్థానిక సంఘం సభ్యులు తప్ప మిగిలిన సభ్యులు, అధ్యక్షులు నిర్ధారిత రీతిలో స్థానిక సంఘం ప్రొసీడింగులు జరిగే సమయంలో శుల్కాలు, లేదా భత్యాలు పొందేందుకు అర్హులు.

**8. నిధులు, ఆడిట్:-** (1) సెక్షన్ (7) లోని ఉపసోక్షన్ (4) లోని నిర్దేశితులకు చెల్లింపులకుగాను కేంద్ర ప్రభుత్వం తగు రీతిలో నిధులను మంజూరు చేయమని రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతుంది. ఇందుకు గాను పార్లమెంట్‌లో తగిన రీతిలో చట్టం ఏర్పరచిన తర్వాతే కేంద్ర ప్రభుత్వం చర్య తీసుకొంటుంది.

(2) రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీ ఏర్పరిచి, సదరు ఏజెన్సీకి ఉపసెక్షన్ (1) కోసం నిధులను బదిలీ చేస్తుంది.

(3) సెక్షన్ (7) ఉప సెక్షన్ (4)లోని నిర్దేశితాల నిధులను ఏజెన్సీ జిల్లా అధికారికి చెల్లిస్తుంది.

(4) ఉపసెక్షన్ (2)లో నిర్దేశిత ఏజెన్సీ ఖాతాలను నిర్వహించి రాష్ట్ర అకౌంటెంట్ జనరల్‌తో సంప్రదించి ఆడిట్ చేస్తుంది. ఏజన్సీలో బాధ్యుడైన ఖాతా నిర్వహణదారు రాష్ట్ర ప్రభుత్వం నిర్ధారించిన తేదీకి ఖాతాలను అప్పగించి తగిన రీతిలో ఆడిట్ చేసిన ప్రతిని, ఆడిటర్ నివేదికను పొందుతాడు.

## అధ్యాయం-IV

## ఫిర్యాదు

**9. లైంగిక వేధింపు ఫిర్యాదు:-** (1) బాధితురాలైన మహిళ కార్యక్షేత్రంలో లైంగిక వేధింపు గురించి ఫిర్యాదును లిఖిత పూర్వకంగా ఏర్పరిచిన అంతర్గత సంఘానికి లేదా స్థానిక సంఘానికి ఏర్పరచని సందర్భంలో సంఘటన జరిగిన మూడు నెలలలోగా ఫిర్యాదు నమోదు చేయాలి.

ఫిర్యాదు లిఖిత పూర్వకంగా లేనప్పుడు ప్రిసైడింగ్ అధికారి లేదా అంతర్గత సంఘం సభ్యుడు లేదా అధ్యక్షుడు లేదా స్థానిక సంఘం సభ్యుడు సందర్భానికి తగినట్టుగా బాధితురాలికి కావలసినంత సహాయం చేస్తారు.

సందర్భాన్ని బట్టి అంతర్గత, స్థానిక సంఘాలు లిఖిత పూర్వకంగా కారణాలు తెలుపుతూ మూడు నెలలు దాటకుండా ఫిర్యాదు నమోదు చేయాల్సి ఉంటుంది. కాల పరిధిలో బాధితురాలయిన మహిళ ఎందుకు ఫిర్యాదు చేయలేక పోయిందో తెలపాల్సి ఉంటుంది.

(2) బాధితురాలు శారీరక లేదా మానసిక సామర్థ్యం కొరవడటం వల్ల లేదా మరణం లేదా ఇతర కారణాల వల్ల ఫిర్యాదు చేయలేకపోయినా ఆమె వారసుడు లేదా ఇతరులు ఈ సెక్షన్ ప్రకారం ఫిర్యాదు నమోదు చేయవచ్చు.

**10. రాజీ:-** (1) అంతర్గత సంఘం లేదా స్థానిక సంఘం సందర్భాన్ని బట్టి సెక్షన్ 11 ప్రకారం విచారణ మొదలు పెట్టే ముందు, బాధితురాలి అభ్యర్థన మేరకు ఆమెకు, ప్రతివాదికి మధ్య రాజీ ద్వారా పరిష్కారయత్నం చేస్తుంది.

అయితే ఈ సందర్భంగా ఎటువంటి ద్రవ్య సర్దుబాటును రాజీ యత్నంగా చేయదు.

(2) స్థానిక సంఘం లేదా అంతర్గత సంఘం సందర్భాన్ని బట్టి ఉపసెక్షన్ (1) ప్రకారం జరిగిన సర్దుబాటును రికార్డు చేసి ప్రతిపాదిత నిర్దిష్ట చర్య నిమిత్తం యాజమాన్యానికి లేదా జిల్లా అధికారికి పంపుతుంది.

(3) సందర్భాన్ని బట్టి స్థానిక సంఘం లేదా అంతర్గత సంఘం ఉపసెక్షన్ (2) ప్రకారం రికార్డు చేసిన సర్దుబాటు ప్రతులు రెండింటినీ ఒకటి బాధితురాలికి మరొకటి ప్రతివాదికి అందజేస్తుంది.

(4) ఉపసెక్షన్ (1) ప్రకారం జరిగిన సర్దుబాటు తరవాత అంతర్గత సంఘం లేదా స్థానిక సంఘం ఎటువంటి విచారణ చేపట్టదు.

**11. ఫిర్యాదు విచారణ:-** (1) సెక్షన్ 10లోని సదుపాయాల మేరకు సందర్భాన్ని బట్టి అంతర్గత సంఘం లేదా స్థానిక సంఘం ప్రతివాది ఉద్యోగి అయినట్లయితే ఫిర్యాదును ఉద్యోగనియమావళికి అనుగుణంగా విచారణను చేపడుతుంది. అటువంటి నియమాలు లేనప్పుడు, నిర్ధారిత రీతిలో లేదా గృహకార్మికుడయిన పక్షంలో స్థానిక సంఘం ప్రాథమిక సాక్ష్యాధారాలున్నట్లయితే ఫిర్యాదును సంఘటన జరిగిన వారంలోగా భారతీయ శిక్షాస్మృతిలోని 509 సెక్షన్ ప్రకారం (1908 నాటి 5వ చట్టం), ఈ చట్టంలోని ఇతర అనువర్తనల ప్రకారం కేసుగా నమోదు చేసేందుకు పోలీసులకు అందజేస్తుంది.

అయితే బాధితురాలు సందర్భాన్ని బట్టి సెక్షన్ 10లోని ఉప సెక్షన్ (2) (సర్దుబాటు నియమనిబంధనల)ని ప్రతివాది పాటించలేదని తెలియజేస్తే, అంతర్గత సంఘం లేదా స్థానిక సంఘం ఆ ఫిర్యాదును విచారించవచ్చు లేదా సందర్భాన్ని బట్టి పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు.

అయితే యజమానికీ, కక్షిదార్లకు విచారణకాలంలో తమ వాదనలు వినిపించేందుకు అవకాశాలు, విచారిత అంశాల ప్రతులను ఇరుపక్షాలకు అందజేస్తుంది. సంఘం ముందు వారి వారి వాదనలకు అవకాశం ఇస్తుంది.

(2) భారతీయ శిక్షాస్మృతి (1860 నాటి 45వ చట్టం) లోని 509 సెక్షన్ అంశాలకు వ్యతిరేకం కాని విధంగా న్యాయస్థానం నేరారోపితుడైన ప్రతివాదికి సముచిత రీతిలో బాధితురాలికి మొత్తం చెల్లించే అవకాశం కల్పిస్తుంది. ఇందుకు సెక్షన్ 15 సదుపాయాలు నియోగిస్తుంది.

(3) సందర్భాన్ని బట్టి స్థానిక సంఘం లేదా అంతర్గత సంఘం ఉపసెక్షన్ (1) ప్రకారం విచారించేందుకు 1908 పౌరస్మృతి చట్టంలో పౌర న్యాయస్థానానికి దావా విచారణకు ఉండే హక్కులను వినియోగించుకోవచ్చు.

ఎ) ఏ వ్యక్తినయినా పరీక్ష నిమిత్తం, ప్రతిన పూని విచారించేందుకు ఉత్తర్వు జారీ చేసి ఆదేశించవచ్చు.

బి) పత్రాల నిరూపణ, దాఖలుకు నిర్దేశించవచ్చు.

సి) ఇతర నిర్ధారిత అంశాలను కోరవచ్చు.

(4) ఉపసెక్షన్ (1) ప్రకారం నిర్వహించే విచారణ 90 రోజులలోగా ముగియాలి.

## అధ్యాయం-V

## ఫిర్యాదు విచారణ

**12. విచారణ జరుగుతుండగా చర్య:-** (1) విచారణ కాలంలో బాధితురాలు లిఖిత పూర్వక అభ్యర్థనను సందర్భాన్ని బట్టి అంతర్గత సంఘం లేదా స్థానిక సంఘానికి అందజేస్తే యాజమాన్యాన్ని ఈ దిగువ చర్యలు తీసుకొమ్మని కోరుతుంది:

ఎ) బాధితురాలిని లేదా ప్రతివాదిని ఇతర కార్యక్షేత్రానికి బదిలీ చేయమంటుంది, లేదా

బి) మూడు నెలల కాలం బాధితురాలికి సెలవు మంజూరు చేయమంటుంది, లేదా

సి) నిర్ధారించినట్టుగా ఇతర విధంగా బాధితురాలికి సేద తీరుస్తుంది.

(2) ఈ సెక్షన్ ప్రకారం బాధితురాలికి మంజూరు చేసిన సెలవు, ఆమెకు ఉద్యోగరీత్యా హక్కుగా వచ్చే సెలవుకు అదనం.

(3) సందర్భాన్ని బట్టి అంతర్గత సంఘం లేదా స్థానిక సంఘం ఉపసెక్షన్ (1) ప్రకారం చేసిన ప్రతిపాదనలను యాజమాన్యం అమలు చేసి నివేదికను సదరు సంఘాలకు నివేదించాల్సి ఉంటుంది.

**13. విచారణ నివేదిక:-** (1) ఈ చట్ట ప్రకారం సందర్భాన్ని బట్టి స్థానిక సంఘం లేదా అంతర్గత సంఘం విచారణ ముగించిన తరువాత కనుక్కొంటున్న అంశాల నివేదికను సందర్భాన్ని బట్టి యాజమాన్యానికి లేదా జిల్లా అధికారికి విచారణ జరిపిన పది రోజులలోగా పంపుతుంది. సదరు నివేదికను ఇరుపక్షాలవారికి అందుబాటులో ఉంచుతారు.

(2) సందర్భాన్ని బట్టి అంతర్గత సంఘం లేదా స్థానిక సంఘం ప్రతివాదిపట్ల ఆరోపణలు నిరూపితం కాలేదని భావించినప్పుడు ఆ విషయాన్ని యాజమాన్యానికి లేదా అధికారికి తెలిపి ఎటువంటిచర్యా గ్రహించనవసరం లేదని తెలుపుతుంది.

(3) సందర్భాన్ని బట్టి అంతర్గత సంఘం లేదా స్థానిక సంఘం ప్రతివాది ఆరోపణలు నిరూపితమయ్యాయని భావిస్తే సందర్భాన్ని బట్టి జిల్లా అధికారికి లేదా యాజమాన్యానికి చర్య తీసుకోమని సూచిస్తుంది.

(i) లైంగిక వేధింపును దుష్ప్రవర్తనగా భావించి ఉద్యోగ నియమావళికి అనుగుణంగా ప్రతివాదిపై చర్యలు తీసుకోమని కోరుతుంది. అటువంటి నియమావళి లేని పక్షంలో నిర్ధారిత రీతిలో చర్య గ్రహించమని కోరుతుంది.

(ii) సెక్షన్ 15 లోని సదుపాయాలమేరకు ఉద్యోగ నియమావళికి వ్యతిరేకం కాకుండా ప్రతివాది వేతనాల లేదా కూలిల నుంచి బాధితురాలికి లేదా వారసులకు చెల్లింపులు జరపమని కోరుతుంది.

ఒక వేళ యాజమాన్యం ప్రతివాది వేతనంలో కోతలు విధులకు హాజరు కాకపోవడం లేదా ఉద్యోగ విరమణ వల్ల విధించలేకపోతే బాధితురాలికే ప్రత్యక్ష చెల్లింపు జరపమని ప్రతివాదిని కోరుతుంది.

క్లాజ్ (ii) ప్రకారం విధించిన చెల్లింపు ప్రతివాది చెల్లించని పక్షంలో సందర్భాన్ని బట్టి అంతర్గత సంఘం లేదా స్థానిక సంఘం భూ రెవెన్యూ బకాయిగా రాబట్టమని జిల్లా అధికారిని కోరుతుంది.

(4) ప్రతిపాదనలు చేరిన 60 రోజుల లోపల యాజమాన్యం లేదా జిల్లా అధికారి చర్యలు స్వీకరిస్తారు.

**14. దుర్భావ పూర్వక ఫిర్యాదు, తప్పుడు సాక్ష్యాలకు శిక్ష:-** (1) అంతర్గత సంఘం లేదా స్థానిక సంఘం ప్రతివాది ఆరోపణలను దుర్భావ పూరితమైనవని లేదా బాధితురాలు లేదా ఇతర వ్యక్తులు తప్పుడు ఫిర్యాదు చేశారని లేదా ఫిర్యాదులో నకిలీ లేదా తప్పుడు పత్రాలు అందించారని భావిస్తే యాజమాన్యానికి లేదా జిల్లా అధికారికి మహిళ మీద లేదా ఇతర వ్యక్తుల మీద ఫిర్యాదును సెక్షన్ (9) లోని ఉపసెక్షన్ (1), (2) ల ప్రకారం చేసినట్టు భావించి ఉద్యోగ నియమావళి ప్రకారం లేదా ఉద్యోగ నియమావళి లేని పక్షంలో నిర్ధారిత రీతిలో చర్య గ్రహించమని కోరుతుంది.

అయితే ఫిర్యాదును వివరించలేకపోవడం లేదా సరయిన సాక్ష్యం ఇవ్వలేకపోవడం ఈ సెక్షన్ ప్రకారం చర్యా హేతువు కాదు. అయితే నిర్ధారిత రీతిలో విచారణలో ఫిర్యాదిదారుకు ఉండే దుర్భావన నిరూపితం అయితేనే చర్యకు ప్రతిపాదించాల్సి ఉంటుంది.

(2) ఫిర్యాదు విచారణ సమయంలో స్థానిక సంఘం లేదా అంతర్గత సంఘం సాక్షులు తప్పుడు సాక్ష్యం ఇచ్చారని లేదా నకిలీ లేదా దురుద్దేశ్య పూర్వకంగా పత్రాలు సమర్పించారని భావిస్తే యాజమాన్యానికి లేదా జిల్లా అధికారికి ఉద్యోగ నియమావళికి అనుగుణంగా లేదా నిర్ధారిత రీతిలో చర్య తీసుకోమని కోరుతుంది.

**15. పరిహార నిర్ధారణ:-** బాధితురాలికి సెక్షన్ 13లోని ఉపసెక్షన్ (3) క్లాజ్ (ii) ప్రకారం చెల్లింపు మొత్తాలను నిర్ధారించే నిమిత్తం అంతర్గత సంఘం లేదా స్థానిక సంఘం దిగువ అంశాలను ప్రాతిపదికగా గ్రహిస్తుంది:

ఎ) బాధితురాలికి కలిగిన మానసిక రుగ్మత, నొప్పి, బాధ, ఉద్వేగ నైరాశ్యం.

బి) లైంగిక వేధింపు సంఘటనలవల్ల ఉద్యోగావకాశాలలో నష్టం.

సి) శారీరక లేదా మానసిక వైద్య చికిత్సకు బాధితురాలు పెట్టిన ఖర్చులు

డి) ప్రతివాది ఆదాయం, ఆర్థికహోదా

ఇ) ఒకే మొత్తంలో లేదా వాయిదాలలో చెల్లింపు చేసే సౌలభ్యం

**16. ఫిర్యాదు, విచారణ ప్రొసీడింగుల ప్రచురణ లేదా తెలపడంపై నిషేధం:-** సమాచార హక్కు చట్టం, 2005 (2005 నాటి 25వ చట్టం) లోని అంశాలకు వ్యతిరేకం కాకుండా సెక్షన్ 9 ప్రకారం చేసిన ఫిర్యాదులో బాధితురాలి గుర్తింపు, చిరునామా, ప్రతివాది, సాక్షుల, ఇతర రాజీ సమాచారం, విచారణ ప్రొసీడింగ్స్, స్థానిక సంఘం లేదా అంతర్గత సంఘం ప్రతిపాదనలు, యజమాని లేదా జిల్లా అధికారి ఈ చట్టం ప్రకారం చర్యలు ప్రచురించడం, ప్రకటించడం లేదా ప్రజలకు తెలపడం, ప్రసార మాధ్యమాలకు ఏ రీతిలోనైనా తెలపడం చేయకూడదు.

అయితే ఈ చట్టం ప్రకారం లైంగిక వేధింపుకు సరయిన వ్యక్తికి లభించిన న్యాయ సమాచార వ్యాప్తిని పేరు, చిరునామా, గుర్తింపు లేదా ఇతర అంచనా వివరాలు తెలపకుండా బాధితురాలి, సాక్షుల గుర్తింపు తెలియని విధంగా చేయవచ్చు.

**17. విచారణ ప్రొసీడింగ్స్, ఫిర్యాదులోని అంశాలు తెలిపినందుకు లేదా ప్రచురించినందుకు దండన:-** ఈ చట్టంలో సెక్షన్ 16 సదుపాయాల ప్రకారం తీసుకున్న చర్యలు, ఫిర్యాదును నిర్వహించే బాధ్యత ఉన్న వ్యక్తి, విచారణ చేసేవారు లేదా ఇతర ప్రతిపాదనలను బహిర్గతం చేస్తే సెక్షన్ 16లోని సదుపాయాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తే ఉద్యోగ నియమాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవచ్చు. అటువంటి ఉద్యోగనియమావళి లేకపోతే నిర్ధారిత రీతిలో చర్యలు తీసుకుంటారు.

**18. అప్పీల్:-** (1) ఎవరయినా సెక్షన్ 13లోని ఉప సెక్షన్ (2) లేదా సెక్షన్ 13 లోని ఉపసెక్షన్ (3) లోని క్లాజ్ (i) లేదా (ii) లేదా సెక్షన్ 14లో ఉపసెక్షన్ (1) లేదా (2) లేదా సెక్షన్ (17) ప్రతిపాదనలకు లేదా, ప్రతిపాదనలు అమలు చేయలేకపోయినా ఉద్యోగ నియమావళికి అనుగుణంగా లేదా ఉద్యోగ నియమావళి లేని పక్షంలో నిర్ధారిత రీతిలో, అమలులో ఉన్న చట్టాలకు వ్యతిరేకం కాని విధంగా ట్రిబ్యునల్‌కు గానీ, న్యాయస్థానంలో గానీ లేదా బాధితురాలికి అనువైన విధంగా అప్పీల్ చేయవచ్చు.

(2) ప్రతిపాదనలు వెలువడిన 90 రోజులలోపు ఉపసెక్షన్ (1) ప్రకారం అప్పీలు చేసుకోవచ్చు.

## అధ్యాయం-VI

## యాజమాన్య విధులు

**19. యాజమాన్య విధులు:-** ప్రతి యాజమాన్యం విధిగా ఈ కింది అంశాలు సమకూర్చాల్సి ఉంటుంది:

ఎ) కార్యక్షేత్రంలో సురక్షిత శ్రామిక పరిసరాలు. కార్యక్షేత్రంలో పనిచేసే వారందరికీ భద్రత.

బి) లైంగిక వేధింపులకు విధించే దండన ఫలితాలు, సెక్షన్ (4) లోని ఉపసెక్షన్ (1) ప్రకారం అంతర్గత సంఘం ఏర్పాటు గురించి ప్రకటన విశిష్ట స్థానంలో ప్రదర్శించాలి.

సి) ఉద్యోగులకు ఈ చట్ట సదుపాయాల గురించి అవగాహన కల్పించేందుకు క్రమబద్ధ సమయ పరిధులలో కార్యశిబిరాలు ఏర్పరచాలి. తగిన రీతిలో అంతర్గత సంఘ సభ్యులకు పరివీక్షణ కార్యక్రమాలు ఏర్పరచాలి.

డి) ఫిర్యాదు, విచారణ నిమిత్తం స్థానిక లేదా అంతర్గత సంఘానికి తగిన వసతులు కల్పించాలి.

ఇ) స్థానిక లేదా అంతర్గత సంఘం ముందు ప్రతివాది, సాక్షులు హాజరయ్యేలా చూడాలి.

ఎఫ్) సెక్షన్ (9) ఉపసెక్షన్ (1) ప్రకారం చేసిన ఫిర్యాదుకు అవసరమయిన సమాచారం అంతర్గత సంఘం లేదా స్థానిక సంఘానికి లభింపచేసేలా చూడాలి.

జి) అమలులో ఉన్న చట్టం లేదా భారతీయ శిక్షాస్మృతి మేరకు జరిగిన నేరం గురించి ఫిర్యాదు చేసేందుకు మహిళకు సహాయం చేయాలి.

హెచ్) బాధితురాలు కాంక్షిస్తే ప్రతివాది కార్య క్షేత్రంలో ఉద్యోగి కానప్పుడు ఎక్కడయితే లైంగిక వేధింపు జరిగిందో అక్కడ భారతీయ శిక్షాస్మృతి (1865 నాటి 45 వ చట్టం) లేదా అమలులో ఉండే ఇతర చట్టాల ప్రకారం బాధితురాలికి ప్రతివాది మీద చర్య చేపట్టేలా చూడాలి.

ఐ) ఉద్యోగ నియమావళి ప్రకారం లైంగిక వేధింపును దుష్ప్రవర్తనగా పరిగణించి, దానికి చర్యను చేపట్టాలి.

జె) అంతర్గత సంఘం నివేదికలను కాల పరిమితిలోగా దాఖలు చేసేలా పరివేక్షించాలి.

## అధ్యాయం-VII

### జిల్లా అధికారి విధులు, అధికారాలు

**20. జిల్లా అధికారి విధులు, అధికారాలు:-** జిల్లా అధికారి-

ఎ) స్థానిక సంఘం కాలపరిమితి లోగా నివేదికలు అందజేసే విధంగా పరివేక్షించాలి.

బి) ప్రభుత్వేతర సంస్థలు లైంగిక వేధింపుల పట్ల జాగరూకత, మహిళల హక్కుల పట్ల అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపట్టే విధంగా చూడాలి.

## అధ్యాయం-VIII

### ఇతరాలు

**21. సాలుసరి నివేదికను సంఘం సమర్పించడం:-** (1) అంతర్గత సంఘం లేదా స్థానిక సంఘం ప్రతి ఏడాదిలో ఒక సమయం నిర్ధారించుకొని, ఆ సమయానికి యాజమాన్యానికి, జిల్లా అధికారికి సాలుసరి నివేదిక సమర్పించాలి.

(2) జిల్లా అధికారి ఉపసెక్షన్ (1) ప్రకారం అందిన నివేదికల ఆధారంగా సంక్షిప్త నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాలి.

**22. సాలుసరి నివేదికలో యాజమాన్యం సమాచారం సమకూర్చడం:-** యాజమాన్యం తన నివేదికలో ఈ చట్ట ప్రకారం నమోదయిన కేసుల సంఖ్య, పరిష్కారం లేదా అటువంటివి అవసరం లేని సందర్భాలలో ఆ విషయాన్ని జిల్లా అధికారికి తెలియజేయాలి.

**23. సముచిత ప్రభుత్వం దత్తాంశ అమలు, నిర్వహణను పరివీక్షించడం:-** కార్యక్షేత్రంలో లైంగిక వేధింపు కేసులన్నింటి వివరాలు అంటే దాఖలైన కేసుల సంఖ్య, పరిష్కారం వివరాలను సముచిత ప్రభుత్వం పరివీక్షించి, నిర్వహించి చట్టం అమలు చేయాల్సి ఉంటుంది. దత్తాంశాన్ని నిర్వహించాల్సి ఉంటుంది.

**24. చట్టం ప్రాచుర్యానికి సముచిత ప్రభుత్వం చర్యలు చేపట్టడం:-** ప్రభుత్వం లభ్యమయ్యే ఆర్థిక, ఇతర వనరులతో ఈ కింది చర్యలు చేపడుతుంది:

ఎ) కార్యక్షేత్రంలో లైంగిక వేధింపునకు వ్యతిరేకంగా రక్షణకు ఈ చట్టంలో కల్పించిన సదుపాయాల పట్ల ప్రజల అవగాహన పెంచేందుకు సముచిత సమాచారాభివృద్ధి, విద్య, ప్రసారం, శిక్షణసామగ్రి, అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తుంది.

బి) [1][స్థానిక సంఘం] సభ్యులకు శిక్షణ, పునరభ్యసన కార్యక్రమాలు రూపొందిస్తుంది.

**25. సమాచారం కోరే రికార్డు పరిశీలన హక్కు, అధికారాలు:-** (1) ప్రజాహితం కోరి లేదా కార్యక్షేత్రంలో మహిళాసక్తుల పరిరక్షణ కోసం లిఖిత పూర్వకంగా సముచిత ప్రభుత్వం ఈ విధంగా ఆదేశిస్తుంది:

ఎ) అవసరమైన పక్షంలో లైంగిక వేధింపు గురించి సమాచారం లిఖిత పూర్వకంగా ఇమ్మని జిల్లా అధికారిని లేదా యాజమాన్యాన్ని అయినా కోరవచ్చు.

బి) ఏ అధికారినైన రికార్డుల పరిశీలనకు నియమించి, కార్యక్షేత్రంలో జరిగిన లైంగిక వేధింపు సమాచారాన్ని ఉత్తర్వులో నిర్దిష్ట కాలపరిమితి విధించి, ఆ గడువులోగా నివేదిక దాఖలు చేయమని కోరవచ్చు.

(2) ప్రతి యాజమాన్యం, జిల్లా అధికారి కోరినప్పుడు అధికారి ముందు పరిశీలనకు సమాచారం, రికార్డులు, ఇతర పత్రాలు అన్నింటినీ ఈ విషయానికి సంబంధించి చూపవలసి ఉంటుంది.

**26. ఈ చట్టంలోని సదుపాయాలను నిర్వర్తించనట్లయితే దండన:-** (1) యాజమాన్యం పాటించకపోతే -

ఎ) సెక్షన్ 4 ఉపసెక్షన్ (1) ప్రకారం అంతర్గత సంఘం ఏర్పాటు చేయకపోతే,

బి) సెక్షన్ 13, 14, 22 ప్రకారం చర్యలు చేపట్టకపోతే,

1. Subs. for "స్థానిక ఫిర్యాదు సంఘం" by Act No. 23 of 2016, w.e.f. 9-5-2016.

సి) ఈ చట్టాన్ని ఉల్లంఘించినా లేదా ఉల్లంఘించే యత్నాలు చేసినా లేదా చట్టంలోని ఇతర సదుపాయాలకు నేర ప్రేరితంగా వర్తించినా సదరు యాజమాన్యానికి యాభైవేల రూపాయల జరిమానా దండన విధింపబడుతుంది.

(2) ఈ చట్టం ప్రకారం దండన పొందిన యాజమాన్యం తిరిగి అదే తప్పును చేసినప్పుడు-

(i) రెట్టింపు శిక్షను, మొదటిసారి విధించిన దానికన్నా ఎక్కువ మొత్తాన్ని గరిష్ట పరిమితిని రెట్టింపు చేసి విధిస్తారు.
అయితే శిక్ష విధించే ముందు న్యాయస్థానం దోషికి ఇతర చట్టాల ద్వారా నేరానికి విధించిన ఉన్నతమైన శిక్షను దృష్టిలో ఉంచుకొంటుంది.

(ii) వ్యాపారం లేదా కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన లైసెన్సు రద్దు లేదా వెనక్కు తీసుకోవడం, నవీకరించకపోవడం అనేవి సందర్భాన్ని బట్టి ప్రభుత్వం లేదా స్థానిక అధికారం చేయవలసి ఉంటుంది.

**27. న్యాయస్థానం ద్వారా నేర విచారణీయత:-** (1) ఏ న్యాయస్థానం ఈ చట్టం ప్రకారం నేరం శిక్షణార్హంగా విచారణీయంగా తలంచదు. లేదా ఏ నియమాలు కానీ బాధితురాలి ఫిర్యాదు మేరకు గానీ లేదా అంతర్గత సంఘం లేదా స్థానిక సంఘం తరపున అధికృతమైతే తప్ప విచారించదు.

(2) ఈ చట్ట ప్రకారం జరిగిన నేరాలను మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ లేదా మొదటి తరగతి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌కు తక్కువ కాని న్యాయస్థానం విచారించదు.

(3) ఈ చట్ట ప్రకారం జరిగిన ప్రతి నేరం జ్ఞేయేతరంగా భావిస్తారు.

**28. ఇతర చట్టాలకు వ్యతిరేకం కాని చట్టం:-** కాలానుగుణంగా ఉన్న ఇతర చట్టాలకు వ్యతిరేకం కాని విధంగా ఈ చట్టంలోని సదుపాయాలు అదనంగా వర్తిస్తాయి.

**29. సముచిత ప్రభుత్వం నియమాలు రూపొందించే అధికారం:-** (1) కేంద్ర ప్రభుత్వం అధికార రాజపత్రంలో ప్రకటించి ఈ చట్టంలోని నియమాలను రూపొందించవచ్చు.

(2) పై అధికారాలకు వ్యతిరేకం కాకుండా ఏ నియమాలనైనా ఈ కింది అంశాలకు సంబంధించి రూపొందించవచ్చు:

ఎ) సెక్షన్ 4 ఉపసెక్షన్ (4) ప్రకారం సభ్యులకు చెల్లించే శుల్కాలు లేదా భత్యాలు.

(బి) సెక్షన్ (7) ఉపసెక్షన్ (1) క్లాజ్ (సి) కి సంబంధించి సభ్యుల ప్రతిపాదన.

(సి) సెక్షన్ (7) ఉపసెక్షన్ (4) కు సంబంధించి అధ్యక్షుల, సభ్యుల శుల్కాలు లేదా భత్యాలు.

(డి) సెక్షన్ (9) ఉపసెక్షన్ (2) ప్రకారం ఫిర్యాదు చేసే వ్యక్తి.

(ఇ) సెక్షన్ (11) ఉపసెక్షన్ (1) ప్రకారం విచారణ చేసే తీరు.

(ఎఫ్) సెక్షన్ (11) ఉపసెక్షన్ (2) లోని క్లాజ్ (సి) ప్రకారం విచారణ చేసే అధికారాలు.

(జి) సెక్షన్ (12) ఉపసెక్షన్ (1) క్లాజ్ (సి) ప్రకారం ప్రతిపాదిత పరిహారం.

(హెచ్) సెక్షన్ (13) ఉపసెక్షన్ (3) క్లాజ్ (i) ప్రకారం చర్య తీసుకునే తీరు.

(ఐ) సెక్షన్ (14) ఉపసెక్షన్ (1), (2) ల ప్రకారం చర్య తీసుకునే తీరు.

(జె) సెక్షన్ (17) ప్రకారం చర్య తీసుకొనే తీరు.

(కె) సెక్షన్ (18) ఉపసెక్షన్ (1) ప్రకారం అప్పీల్ చేసే తీరు.

(ఎల్) సెక్షన్ (19) క్లాజ్ (సి) ప్రకారం అంతర్గత సంఘం సభ్యులకు పునరభ్యసన కార్యక్రమాలు, ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు కార్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు రూపొందించే తీరు.

(ఎమ్)సెక్షన్ (21) ఉపసెక్షన్ (1) ప్రకారం అంతర్గత, స్థానిక సంఘం సాలుసరి నివేదిక తయారు చేసే సమయం, స్వరూపం.

(3) కేంద్ర ప్రభుత్వం ఈ చట్టంలో చేసిన ప్రతి నియమాన్ని రూపొందించిన వెంటనే పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రవేశపెడుతుంది. అదీ 30 రోజులలోగా సమావేశాలు జరుగుతున్నప్పుడు సమావేశ కాలం ముగియకుండా. ఒక వేళ ముగిస్తే తరవాత సమావేశాల్లో ప్రవేశపెడుతుంది. ఉభయ సభలు నియమంలో మార్పులకు

అంగీకరిస్తే సదరు నియమం మార్పులతో లేదా లేకుండా అంతకు ముందు చేసిన నియమానికి వ్యతిరేకం కాని విధంగా మార్పులు, చేర్పులు అనువర్తిస్తాయి.

(4) సెక్షన్ (8), ఉపసెక్షన్ (4) ప్రకారం రాష్ట్రప్రభుత్వం నియమం రూపొందించి ఉభయసభలున్న చోట రెండింటిలోనూ ప్రవేశ పెడుతుంది లేదా ఒక సభయే ఉన్న చోట ఆ సభలో ప్రవేశపెడుతుంది.

**ఇబ్బందులు తొలగించే అధికారం:-** (1) ఈ చట్టంలోని సదుపాయాల వల్ల ఏమయినా ఇబ్బందులు ఎదురయితే కేంద్ర ప్రభుత్వం రాజపత్రంలో ఉత్తర్వు ద్వారా ఇబ్బందిగా ఉన్న నియమాలను చట్టంలోని ఇతర సదుపాయాలకు సందిగ్ధం కాని విధంగా ఇబ్బందిని తొలగించేందుకు అవసరమైన రీతిలో ఏర్పరచవచ్చు.

అయితే ఈ చట్టం అమలు ఆరంభమైన 2 ఏళ్ళ తరువాత ఈ సెక్షన్ ప్రకారం ఉత్తర్వు ఏదీ జారీ చేయకూడదు.

(2) ఈ సెక్షన్ ప్రకారం రూపొందించిన ప్రతీ ఉత్తర్వును తయారు కాగానే పార్లమెంట్ ఉభయసభల్లోనూ ప్రవేశ పెడతారు.

------

# కార్యక్షేత్రంలో మహిళా లైంగిక వేధింపు (నివారణ, నిషేధం, దిద్దుబాటు) నియమావళి, 2013

[1][ప్రకటన సంఖ్య జిఎస్ఆర్ 769 (ఇ) తే.9-12-2013]

**2013 నాటి 14 చట్టం అమలు తేదీ ప్రకటన**

(ఎస్.ఒ.3606(ఇ), తే. 9-12-2013)

[2][కార్యక్షేత్రంలో మహిళా లైంగిక వేధింపు (నివారణ, నిషేధం, దిద్దుబాటు) చట్టం, (2013 నాటి 14వ చట్టం)] సెక్షన్ (1) లోని ఉపసెక్షన్ (3) లో నిర్ధారించిన అధికారాల మేరకు కేంద్రప్రభుత్వం 9 డిసెంబర్ 2013 నాటి నుంచి చట్టంలోని సదుపాయాలు అమలులోకి వస్తాయని ప్రకటిస్తోంది.

కార్యక్షేత్రంలో మహిళా లైంగిక వేధింపు చట్టం (నివారణ, నిషేధం, దిద్దుబాటు 2013 (2013 నాటి 14వ చట్టం) లోని సెక్షన్ 19 లోని అధికారాలను పురస్కరించుకొని ఈ దిగువ నియమాలను కేంద్ర ప్రభుత్వం రూపొందించింది.

**1. లఘునామం, ప్రారంభం:-** (1) ఈ నియమాలను కార్యక్షేత్రంలో మహిళా లైంగిక వేధింపు (నివారణ, నిషేధం, దిద్దుబాటు నియమావళి 2013గా వ్యవహరిస్తారు.

[3][(2) ఇవి రాజపత్రంలో ప్రచురితం అయిన తేదీ నుంచి అమలులోకి వస్తాయి.

**2. నిర్వచనాలు:-** ఈ నియమాలలో సందర్భానుసారంగా వేరే విధంగా వివరిస్తే తప్ప ఈ కింది నిర్వచనాలు వర్తిస్తాయి:

ఎ) **'చట్టం'** అంటే కార్యక్షేత్రంలో మహిళా లైంగిక వేధింపు (నివారణ, నిషేధం, దిద్దుబాటు) చట్టం, 2013 (2013 నాటి 14వ చట్టం) అని అర్థం.

బి) **'ఫిర్యాదు'** అంటే సెక్షన్ 9 ప్రకారం చేసిన ఫిర్యాదు.

---

1. భారత రాజ పత్రంలో ప్రచురితం, విస్తరణ నెం. 593, భాగం II, సెక్షన్ 3 (i) తే. 9-12-2013,
2. తేదీ : 9-12-2013 నాటి నుంచి అమలు.
3. భారతదేశ రాజపత్రంలో విస్తరణ నెం.2733 భాగం - II, సెక్షన్ 3 (ii) తే. 9-12-2013.

సి) 'ఫిర్యాదు సంఘం' అంటే సందర్భాన్ని బట్టి అంతర్గత సంఘం లేదా స్థానిక సంఘం అని అర్థం.

డి) 'సంఘటన' అంటే సెక్షన్ 2 లోని క్లాజ్ (ఎన్) ప్రకారం నిర్వచితమైన లైంగిక వేధింపు సంఘటన.

ఇ) 'సెక్షన్' అంటే ఈ చట్టంలోని సెక్షన్ అని అర్థం.

ఎఫ్) ప్రత్యేక అవగాహన కర్త అంటే ప్రజలతో మాట్లాడటంలోనూ, వారి ప్రత్యేకావసరాలు తీర్చి తేడాలు తొలగించడంలో శిక్షణ పొందిన వ్యక్తి.

జి) ఇందులో నిర్వచించని పదాలు, భావనలు, చట్టంలో నిర్వచించిన విధంగానే అనువర్తిస్తాయి.

**3. అంతర్గత సంఘం సభ్యుల శుల్కం, లేదా భత్యాలు:-** (1) ప్రభుత్వేతర సంస్థల నుంచి నియామకం పొందిన సభ్యులకు అంతర్గత సంఘం ప్రొసీడింగ్స్ నిర్వహణ నిమిత్తం రోజుకు రెండు వందల రూపాయల భత్యం చెల్లింపు ఉంటుంది. ప్రయాణ ఖర్చుల నిమిత్తం మూడవ తరగతి ఎసి రైలు ఛార్జీలు లేదా ఎసి బస్, ఆటో రిక్షా లేదా టాక్సీ లేదా ప్రయాణానికి అయిన అసలు ఖర్చును ఏది తక్కువ అయితే దానిని చెల్లిస్తారు.

(2) ఉద్యోగికి ఉపనియమం (1)లో నిర్దేశించిన భత్యాల చెల్లింపుల బాధ్యత ఉంటుంది.

**4. లైంగిక వేధింపు అంశాలతో పరిచయం ఉన్న వ్యక్తి:-** సెక్షన్ 7 ఉపసెక్షన్ (1) క్లాజ్ (సి) లైంగిక అంశాలతో పరిచయం ఉన్న వ్యక్తిని నిపుణులుగా నియమించి సదరు అంశాలతో దిగువ అంశాల ద్వారా నియోగిస్తారు.

ఎ) సంఘ కృషి రంగంలో 5 ఏళ్ళ అనుభవం ఉన్న సామాజిక కార్యకర్తను అనుకూల సమాజ స్థితుల సృజనకు, మహిళా సాధికారతకు ప్రత్యేకించి కార్యక్షేత్రంలో లైంగిక వేధింపుల గమనింపుకు నియోగించుకుంటారు.

బి) కార్మిక, సేవ, పౌర లేదా నేర న్యాయ చట్టాలతో పరిచయం ఉన్న వ్యక్తి.

**5. స్థానిక సంఘం, అధ్యక్షుల, సభ్యుల శుల్కాలు లేదా భత్యాల చెల్లింపులు:-** (1) సంఘం ప్రొసీడింగ్స్ నిర్వహణకు గాను రోజుకు రెండు వందల రూపాయల భత్యాన్ని స్థానిక సంఘం అధ్యక్షుడికి చెల్లిస్తారు.

(2) సెక్షన్ 7, ఉపసెక్షన్ (1) క్లాజ్ (బి), (డి) ల ప్రకారం కాకుండా ప్రతిపాదితమైన ఇతర సభ్యులకు సంఘం ప్రొసీడింగ్స్ నిర్వహణకు గాను రోజుకు 250 రూపాయలతో పాటు ప్రయాణ వ్యయాన్ని చెల్లిస్తారు. మూడవ తరగతి ఎ.సి లేదా ఎ.సి.బస్, ఆటో రిక్షా లేదా టాక్సీ లేదా ప్రయాణానికైన వాస్తవ ఖర్చు ఏది తక్కువ మొత్తమో ఆ మొత్తాన్ని చెల్లిస్తారు.

ఉపనియమం (1), (2) ద్వారా అయ్యే చెల్లింపులను జిల్లా అధికారి బాధ్యతగా చెల్లిస్తారు.

**6. లైంగిక వేధింపు ఫిర్యాదు:-** సెక్షన్ 9 ఉపసెక్షన్ (2) ప్రయోజనార్థం.

(i) భౌతిక అసామర్థ్యం వల్ల బాధితురాలు ఫిర్యాదు చేయలేకపోతే ఫిర్యాదును ఈ కింది వారు చేయవచ్చు:

ఎ) ఆమె బంధువు లేదా స్నేహితులు, లేదా

బి) ఆమె సహ ఉద్యోగి, లేదా

సి) మహిళా జాతీయ కమిషన్ అధికారి లేదా రాష్ట్ర కమిషన్ అధికారి. లేదా

డి) బాధితురాలి లిఖిత పూర్వక అనుమతితో సంఘటన పరిజ్ఞానం ఉన్న వ్యక్తి.

(ii) మానసిక అసామర్థ్యం వల్ల బాధితురాలు ఫిర్యాదు చేయలేకపోతే, సదరు ఫిర్యాదును ఈ కిందివారు చేయవచ్చు:

ఎ) ఆమె బంధువు లేదా స్నేహితులు లేదా

బి) ప్రత్యేక అవగాహన కర్త, లేదా

సి) అర్హత ఉన్న మనోవిజ్ఞాన శాస్త్రవేత్త లేదా మానసిక చికిత్సకుడు, లేదా

డి) బాధితురాలి చికిత్స చేసే అధికారి లేదా సంరక్షకుడు లేదా

ఇ) సంఘటన పరిజ్ఞానంఉన్న వ్యక్తి, బాధితురాలి సంబంధీకులతో, లేదా స్నేహితులతో లేదా ప్రత్యేక అవగాహన కర్త లేదా అర్హత ఉన్న

మనోవిజ్ఞాన శాస్త్రవేత్త లేదా మానసిక చికిత్స కర్త లేదా చికిత్స లేదా సంరక్షణ గమనించే అధికారి లేదా సంరక్షకుడితో కలిసి.

(iii) ఏ కారణం వల్లయినా బాధితురాలు ఫిర్యాదు చేయలేకపోతే లిఖిత పూర్వక అనుమతితో సంఘటన పరిజ్ఞానం ఉన్న వ్యక్తి ఫిర్యాదు చేయవచ్చు.

(iv) బాధితురాలు మరణిస్తే, సంఘటన పరిజ్ఞానం ఉన్న వ్యక్తి ఎవరయినా వారసురాలి లిఖిత పూర్వక అనుమతితో ఫిర్యాదు చేయవచ్చు.

**7. ఫిర్యాదును విచారించే తీరు:-** (1) సెక్షన్ (11) లోని సదుపాయాల మేరకు ఫిర్యాదు చేసే సమయంలో ఫిర్యాదుదారు ఆరు ప్రతులను బలపరిచే పత్రాలను సాక్షుల పేర్లు, చిరునామాలతో సహా జత చేయాలి.

(2) బాధితురాలి ఫిర్యాదు చేరిన వారం రోజులలోపు నియమం (1) ప్రకారం ప్రతివాదికి పంపుతుంది.

(3) ప్రతివాది ఫిర్యాదుకు సమాధానాన్ని పత్రాలు, సాక్షులపేర్లు చిరునామాలతో సహా అందిన పది రోజులలోగా ఉపనియమం (1) ప్రకారం పంపుతారు.

(4) ఫిర్యాదు సంఘం సహజన్యాయ సూత్రాలను అనుసరించి ఫిర్యాదును విచారిస్తుంది.

(5) సందర్భాన్ని బట్టి ప్రిసైడింగ్ అధికారి లేదా అధ్యక్షుడు నిర్వహించే మూడు వరుసవాయిదా విచారణకు ప్రతివాది లేదా ఫిర్యాది దారు తగిన కారణం లేకుండా గైర్హాజర్ అయితే ఫిర్యాదు సంఘం విచారణ సమావేశాలు నిలిపి వేయవచ్చు లేదా ఏకపక్ష నిర్ణయం ప్రకటించవచ్చు.

సదరు కక్షిదారుకు ముందుగా 15 రోజుల ముందే ప్రకటన లిఖిత పూర్వకంగా జారీ చేసి సదరు రద్దు లేదా ఏక పక్ష ఉత్తర్వు ప్రకటించాలి.

(6) ఫిర్యాదు సంఘం కేసు విచారణలో ఏ దశలోనూ చట్టం ప్రాక్టీసు చేస్తున్నవారిని (న్యాయవాదిని) ప్రాతినిధ్యం వహించేందుకు కక్షిదార్లను అనుమతించదు.

(7) విచారణ చేసేందుకు ఫిర్యాదు సంఘం ప్రిసైడింగ్ అధికారి లేదా అధ్యక్షులతోపాటు కనీసం ముగ్గురు సభ్యులు హాజరు కావాలి.

**8. విచారణ వాయిదా కాలంలో ఫిర్యాదిదారుకు ఇతర పరిహారం:-** బాధితురాలి లిఖిత పూర్వక అభ్యర్ధనతో ఫిర్యాదు సంఘం యాజమాన్యానికి ఈ విధంగా ప్రతిపాదించవచ్చు:

ఎ) బాధితురాలి కార్యాచరణ మేరకు ప్రతివాదిని నిరోధించడం లేదా ఆమె గోపనీయ నివేదిక రచన, దాన్ని మరో అధికారికి కేటాయించడం చేయవచ్చు.

బి) విద్యా సంస్థ అయితే ప్రతివాదిని బాధితురాలి విద్యా విషయక కార్యకలాపాల పర్యవేక్షణ నుంచి నిరోధించవచ్చు.

**9. లైంగిక వేధింపుపై చర్య గ్రహించే తీరు:-** ఉద్యోగ నియమావళి ఉన్న చోట తప్ప మిగిలిన సందర్భాలలో ఫిర్యాదు సంఘం ప్రతివాది పట్ల ఆరోపణలు రుజువయినాయని భావిస్తే యాజమాన్యానికి లేదా జిల్లా అధికారికి సందర్భాన్ని బట్టి చర్య తీసుకోవాలని ప్రతిపాదిస్తుంది. లిఖిత క్షమాపణ, హెచ్చరిక, అభిశంసన లేదా మందలింపు, పదోన్నతి నిలుపుదల, వేతన పెంపుదల లేదా ఇంక్రిమెంట్ల నిలుపుదల, ప్రతివాదిని ఉద్యోగం నుంచి తొలగింపు లేదా సలహా సమావేశాలకు పంపడం లేదా సముదాయసేవకు వినియోగం వంటి చర్యలు ఉండవచ్చు.

**10. తప్పుడు లేదా దుర్భావ పూర్వక ఫిర్యాదు లేదా తప్పుడు సాక్ష్యానికి చర్య:-** ఉద్యోగ నియమావళి ఉన్న చోట తప్ప మిగిలిన సందర్భాలలో ఫిర్యాదు సంఘం ప్రతివాది ఆరోపణ దుర్భావ పూర్వకమని భావించినా లేదా బాధితురాలు లేదా ఇతర వ్యక్తి ఫిర్యాదు చేసి ఆ తరవాత తప్పుడు ఫిర్యాదు అని తెలిసినా లేదా బాధితురాలు లేదా ఇతర వ్యక్తి ఫిర్యాదుకు తప్పుడు లేదా నకిలీ పత్రాలు జతచేశారని భావించినా జిల్లా అధికారికి లేదా యాజమాన్యానికి సందర్భాన్ని బట్టి నియమం 9 ప్రకారం చర్య తీసుకోమని కోరుతుంది.

**11. అర్జీ/అపీల్:-** సెక్షన్ 18 లోని సదుపాయాల మేరకు ఏ వ్యక్తి అయినా సెక్షన్ 13, ఉప సెక్షన్ (2) లేదా సెక్షన్ 13 ఉపసెక్షన్ (3) క్లాజ్ (i) లేదా (ii) లేదా సెక్షన్ (14) ఉపసెక్షన్ (1) లేదా (2) లేదా సెక్షన్ 17 లేదా ప్రతిపాదనలు అమలు చేయకపోవడంవల్ల ఇబ్బంది కలిగితే పారిశ్రామిక ఉద్యోగ (స్థాయీ ఉత్తర్వులు) చట్టం 1946 నాటి 20వ చట్టం) లోని సెక్షన్ (2) క్లాజ్ (ఎ) ప్రకారం అర్జీ అధికారికి అర్జీ చేసుకోవచ్చు.

**12. సెక్షన్ 16 సదుపాయాలకు అవరోధం కలిగితే జరిమానా:-** సెక్షన్ 17 సదుపాయాల మేరకు ఎవరయినా సెక్షన్ 16 సదుపాయాలకు అవరోధం కలిగిస్తే, సదరు వ్యక్తి నుంచి 500 రూపాయలను జరిమానాగా యాజమాన్యం రాబడుతుంది.

**13. కార్య శిబిరాలు మొదలగువాటి నిర్వహణ తీరు:-** సెక్షన్ 19 సదుపాయాల పేరుకు ప్రతి యజమాని తప్పనిసరిగా ఈ కింది చర్యలు చేపట్టాలి.

ఎ) కార్యక్షేత్రంలో లైంగిక వేధింపు నిరోధం, నిషేధం, దిద్దుబాటు గురించి ప్రకటన లేదా తీర్మానం లేదా చార్టర్ లేదా అంతర్గత విధానాన్ని రూపొందించి విస్తృత వ్యాప్తి చేసి లింగ సంబంధ సురక్షిత స్థానాలను ప్రోత్సహించే సామరస్య వాతావరణం కల్పించి అంతర్లీన వైరుధ్యాంశాలను తొలగించాలి.

బి) అంతర్గత సంఘం సభ్యులకు పునరభ్యసన కార్యక్రమాలు, సదస్సులు ఏర్పాటు చేయాలి.

సి) ఉద్యోగ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. పంచాయత్ రాజ్ సంస్థలు, గ్రామసభ, మహిళా సముదాయాలు, మాతృమూర్తుల సంఘం, వయోజన సముదాయాలు, నగర స్థానిక సంస్థలు, అవసరమైన ఇతర సంస్థలతో వేదిక ఏర్పరచాలి.

డి) సామర్థ్య నిర్మితి, నైపుణ్య నిర్మితి కార్యక్రమాలను అంతర్గత సంఘం సభ్యులకు నిర్వహించాలి.

ఇ) అంతర్గత సంఘం సభ్యుల పేర్లను, వివరాలను ప్రకటించాలి.

ఎఫ్) రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మాడ్యూళ్ళను ఉపయోగించి కార్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు ఏర్పరచి ఉద్యోగులకు ఈ చట్ట సదుపాయాల పరిజ్ఞానం కల్పించాలి.

**14. సాలుసరి నివేదిక తయారీ:-** సెక్షన్ 21 ప్రకారం ఫిర్యాదు సంఘం రూపొందించే సాలుసరి నివేదికలో ఈ దిగువ వివరాలుండాలి:

ఎ) ఏడాదిలో జరిగిన లైంగిక వేధింపు ఫిర్యాదుల సంఖ్య.

బి) ఏడాదిలో పరిష్కరించిన ఫిర్యాదుల సంఖ్య

సి) 90 రోజులను మించి వాయిదాలో ఉన్న ఫిర్యాదుల సంఖ్య

డి) లైంగిక వేధింపునకు సంబంధించి నిర్వహించిన కార్య శిబిరాలు లేదా అవగాహన కార్యక్రమాల సంఖ్య

ఇ) జిల్లా అధికారి లేదా యాజమాన్యం తీసుకునే చర్య స్వభావం.

------